## మన్మోహన్ సింగ్ ప్రోద్బలంతోనే..

# హైదరాబాద్ మెట్రోరైల్ అవతరణ



మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రోద్బలం, మద్దతు, సహాయంతోనే ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన పిపిపి మెట్రో ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైల్ అవతరించిందని, ఆయనకు హైదరాబాదీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారని మెట్రోరైల్ ఎం.డి ఎన్‌విఎస్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ మరణం పట్ల ఎన్‌విఎస్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. దేశ మౌలిక సౌకర్యాల రంగ అభివృద్ధికి ఒక ట్రిలియన్ డాలర్లు (అప్పట్లో 60 లక్షల కోట్ల రూపాయలు) కావాలని అందులో సగభాగం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పిపిపి) పద్ధతిలో ప్రైవేట్ కంపెనీల పెట్టుబడుల ద్వారా రావాలని ఆయన అభిమతమని తెలిపారు. అప్పటికే దివంగత మాజీ ప్రధాని పి.వి నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో కలిసి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ద్వారా మన దేశంలో అధునాతన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, టెలికమ్యూనికేషన్ వ్యవస్థల వంటి రంగాలలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అభివృద్ధి చెందుతుండగా, భారతీయ రైల్వేలలో సంస్కరణలు జరగలేదన్నారు. ప్రైవేటురంగ పెట్టుబడులు ఆహ్వానించబడలేదన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టులు అత్యంత ఆర్థిక లావాదేవిలతో కూడినవి కావడంతో ప్రపంచమంతటా నగరాల అవసరాల దృష్ట్యా ప్రభుత్వ రంగ ప్రాజెక్టులుగానే నిర్మాణం జరిగాయని చెప్పారు. అలాంటి పరిస్థితులలో హైదరాబాద్ మెట్రోను ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డిల ప్రోద్బలంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో తాము హైదరాబాద్ మెట్రోను పిపిపి విధానంలో రూపొందించగా, డాక్టర్ మన్మోహన్ సింగ్ దీనిని అభినందించారని ఎన్‌విఎస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంటుగా రూ.1,458 కోట్ల వైబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ని కూడా డాక్టర్ మన్మోహన్ సింగ్ సారథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. హైదరాబాద్ మెట్రోలో సఫలమైన పిపిపి బిడ్డింగ్ విధానంపై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియాకు హైదరాబాద్ మెట్రో ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి ఒక లేఖ ద్వారా వివరించగా, దానిపై డాక్టర్ మన్మోహన్ సింగ్ హైదరాబాద్ మెట్రో ఒక దిక్సూచిగా నిలుస్తుందని, దేశంలో ఇతర ప్రాజెక్టులు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని ఆదేశాలు జారీచేశారని తెలిపారు. మెటాస్ వైఫల్యం ఉదంతంతో అనేక మంది హైదరాబాద్ మెట్రోపై విమర్శలు గుప్పించినా, ఇదే సరైన విధానమని, మీరు ఈ పద్ధతినే కొనసాగిస్తూ మరల అంతర్జాతీయ టెండర్లకు వెళ్లాలని డాక్టర్ మన్మోహన్‌సింగ్ హైదరాబాద్ మెట్రో పిపిపి విధానానికి మద్దతుగా నిలిచారని ఎన్‌విఎస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. ప్రముఖ ఆర్థికవేత్తగా, ఆర్థిక సంస్కరణల పితామహునిగా, ప్రధానమంత్రిగా భారత దేశ ఆర్థిక పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎనలేని కృషి చేశారని హైదరాబాద్ మెట్రోరైల్ ఎం.డి ఎన్‌విఎస్ రెడ్డి కొనియాడారు.